సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం : 14 : జూన్ : 2023



గిరిప్రదక్షిణ రోడ్డుకు మరమ్మతులు
యాదగిరి కొండకు దిగువన ఉన్న గిరి ప్రదక్షిణ రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టారు.
- 8లో



'మన ఊరు-మన బడి' భేష్
విద్యావ్యవస్థలో సంస్కరణలకు మన ఊరు-మన బడి బేషగ్గా ఉందని అమర్‌ప్రీత్ దుగ్గల్ అన్నారు.
- 10లో

గరిష్టం/కనిష్టం
40° / 29°

వాతావరణం
పాక్షికంగా మేఘవృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గం విస్తరణ

- జిల్లా నుంచి ఏడుగురికి స్థానం

సాక్షి, యాదాద్రి : బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నేతలకు చోటు దక్కింది. భువనగిరి, ఆలేరు, మునుగోడు నియోజకవర్గాల్లో ఏడుగురు నాయకులకు నూతన కమిటీలో స్థానం కల్పిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో భువనగిరి నుంచి కర్నాటి ధనుంజయ్య, జిట్టా బాలకృష్ణారెడ్డి, గూడూరు నారాయణరెడ్డి, వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, సూదగాని హరిశంకర్ గౌడ్, పడాల శ్రీనివాస్, మునుగోడు నియోజకవర్గం నుంచి దోనూరి వీరారెడ్డి ఉన్నారు. వీరి నియామకం వెంటనే అమలులోకి వస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్ర పాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయ స్వామికి ఇష్టమైన రోజు కావడంతో ఆచార్యులు ఆకుపూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంజనేయస్వామిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. అనంతరం అంజనీపుత్రుడికి ఇష్టమైన నైవేద్యాన్ని ఆరగింపు పెట్టారు. ఇక ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలను విశేషంగా నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలను ఆచార్యులు చేపట్టారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

భువనగిరిటౌన్ : రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరు వులను సబ్సిడీపై ఇవ్వాని డిమాండ్ చేశారు. ఏకకాలంలో ప్రభుత్వం రుణమాఫీ అమలు చేయాలన్నారు. రైతుల పంటలకు మద్దతు ధర ప్రకటించి వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు.అనంతరం కలెక్టరేట్ ఏఓ నాగేశ్వరాచారి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లెపు అడవయ్య, నాయకులు ఇక్కిరి సహదేవ్, కట్ట సమరసింహారెడ్డి, మామిడాల బాల మల్లేష్, నేరేడు స్వామి, ఎలగందుల సిద్దులు, పైసా రాందాస్, బుషే శ్రీశైలం, ఇక్కిరి సిద్దులు, వలిగొండ నవీన్, పంజాల మురళి పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు



మాట్లాడుతున్న కంచర్ల రామకృష్ణారెడ్డి

రామన్నపేట : ఆయిల్‌పామ్ సాగు ద్వారా అధిక లాభాలు పొందవచ్చని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఎన్నారం గ్రామంలో ఆయిల్ ఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు మూసపద్ధతి సాగుకు స్వస్తి పలకాలని ఆధునిక పద్ధతులు పాటించాలని చెప్పారు. శ్రమ, పెట్టుబడి, సాగునీరు, కూలీలు అవసరం తక్కువగా ఉండి అధిక ఆదాయం సమకూర్చే ఆయిల్‌పామ్ సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. పంటను సాగుచేసే రైతులకు తమ సంస్థ ఉద్యోగులు అందుబాటులో ఉంటూ అవసరమైన సలహాలు అందిస్తారని తెలిపారు. సర్పంచ్ మెట్టు మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బొక్కు మాధవరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ కమ్మంపాటి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ ఏనగు పుష్పావెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మందడి ఉదయ్‌రెడ్డి, కొండూరు శంకర్, ఆయిల్‌ఫెడ్ జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్, ఉద్యానవన అధికారి కవిత, ఏఓ యాద గిరిరావు పాల్గొన్నారు.

సమస్యల బడి

- నత్తనడకన సాగుతున్న 'మన ఊరు- మనబడి' పనులు
- నిధులున్నా పనులు అంతంతే..
- స్కావెంజర్లు లేక పాఠశాలల ఆవరణలో పేరుకుపోయిన చెత్త
- అధ్వానంగా మరుగుదొడ్లు, మూత్రశాలలు
- 'చెప్పుకోలేని బాధ'లో విద్యార్థినులు



'గుట్ట' జెడ్పీ బాలుర పాఠశాల ఆరుబయట పందులు తిరిగే చోట వంట చేస్తున్న సిబ్బంది

సాక్షి, యాదాద్రి : ప్రభుత్వ స్కూళ్లలో సమస్యలు తాండవిస్తున్నాయి. వేసవి సెలవుల అనంతరం స్కూళ్లకు వచ్చిన విదార్థులకు అవే స్వాగతం పలుకుతున్నాయి. తరగతి గదుల కొరత, పలుచోట్ల మూత్రశాలు, మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు. స్కావెంజర్లను నియమించకపోవడంతో విద్యార్థులే పాఠశాలలను శుభ్రం చేసుకునే దుస్థితి నెలకొంది. 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో చేపట్టిన పనులు సగం కూడా పూర్తి కాలేదు. సరైన పర్యవేక్షణ లేక పాఠశాలల ప్రగతి కుంటుపడుతోంది.

నలుగురే ఇన్‌చార్జ్ ఎంఈఓలు

జిల్లాలో 17మండలాలు ఉండగా ముగ్గురు పీజీ హెచ్‌ఎంలు ఎఫ్‌ఏసీ మండల విద్యాశాఖ అధికారులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వారికి వివిధ రకాల రిపోర్టులు ఇవ్వడం, వారి సొంత పాఠశాలలను చూసుకోవాల్సి ఉండటంతో ఉపాధ్యాయుల రాకపై పెద్దగా దృష్టిపెట్టడం లేదు. మారుమూల గ్రామాల పాఠశాలల్లో ఇద్దరు ఉన్న పాఠశాలల్లో ఎప్పుడు చూసినా ఒక్కరే కన్పిస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి.

పాఠశాలలను శుభ్రం చేసేవారేరీ?

పాఠశాలలను శుభ్రం చేసేందుకు స్వీపర్లు, స్కావెంజర్లు, అటెండర్లు లేరు. దీంతో ఈ బాధ్యత మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రభుత్వం అప్పగించింది. తమ వద్దే పని ఒత్తిడి అధికంగా ఉందని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల సిబ్బంది బడి మొఖం చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాఠశాలలను విద్యార్థులే శుభ్రం చేసుకుంటున్నారు.



చౌల్లరామారం జెడ్పీహెచ్‌ఎస్‌లో అపరిశుభ్రంగా పాఠశాల ఆవరణ

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



స్కావేంజర్‌లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గ్రామ పంచాయతీ సిబ్బంది ఒకరిని ప్రత్యామ్నాయంగా పంపిస్తున్నారు. వారు గ్రామ పంచాయతీలో పనులు లేనప్పుడు మాత్రమే వస్తున్నారు. దీంతో పాఠశాలను పరిశుభ్రం చేసేవారు లేకుండా పోతున్నారు. ఈ స్కావేంజర్‌ల కొరత వలన చాలా అవస్థలు పడుతున్నాం. వెంటనే వారిని నియమించాలి.

– లిక్కి జానకి, చిన్నకందుకూర్, హెచ్‌ఎం

ఏడాదిగా రూ.12కోట్ల పనులే..

ప్రభుత్వ చేపట్టిన మనఊరు..మన బడి కార్యక్రమ పనులు నత్తనడకన జరుగుతున్నాయి.జిల్లాలోని 712 పాఠశాలుండగా తొలివిడతలో గతేడాది రూ.49.24 కోట్లతో 251 పాఠశాలల అభివృద్ధి పనులు చేపట్టారు. 37.24 కోట్ల పనులు ఇంకా జరగాల్సి ఉంది. కాగా, 50 పాఠశాలల్లో రూ.12 కోట్ల పనులు పూర్తి చేశారు. బిల్లులు రూ.10.50 కోట్లు విడుదల చేశారు. ఇంకా రూ.1.50 కోట్లు చెల్లించాల్సి ఉంది. స్కూల్‌మేనేజ్ మెంట్ కమిటీలకు పనులు చేయడంలేదు. కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తే ఇప్పటి వరకు 50శాతం పనులు కూడా కాలేదు.



మోటకొండూర్‌లోని బాలుర పాఠశాలలో మూత్రశాలల మధ్య పెరిగిన చెట్లు

పాఠశాలల్లో సమస్యలు ఇలా..

- ఆత్మకూరు(ఎం)మండలంలోని కూరెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022-23లో మన ఊరు-మన బడి కార్యక్రమం కింద రూ.22లక్షలు మంజూరు చేశారు. పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం, ఇతర మరమ్మతులు, ఎలక్ట్రిసిటీ పనులు ఏడాది నుంచి నత్తనడకన సాగుతున్నాయి. డైనింగ్ హాల్ నిర్మాణ పనులు మొదలు పెట్టలేదు.
- యాదగిరిగుట్ట పట్టణంలోని జెడ్పీ బాలురు, బాలికల పాఠశాల విద్యార్థులు ప్రధాన రహదారి దాటి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం ఆరుబయటే వండుతున్నారు. పందులు తిరిగి అపరిశుభ్రం చేస్తున్నాయి.
- ఆలేరు పాఠశాలలో సరైన టాయిలెట్స్ లేవు. విద్యార్థుల భోజన సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన డైనింగ్ హాల్ పిల్లర్ల దశలోనే వదిలేశారు.బాలికల పాఠశాల, గొలనుకొండ, పాఠశాలలో టాయిలెట్స్ మరమ్మతుల పనులు చేపట్ట లేదు.
- బొమ్మలరామారం మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాల భవన నిర్మాణం మొదలు కాలేదు. మోటకొండూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలుర మరుగుదొడ్లలో పిచ్చి మొక్కలు, కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. నీళ్ల సౌకర్యం లేదు.
- గుండాల మండలంలో మన ఊరి మనబడి కార్యక్రమంలో ఏ ఒక్క పాఠశాలలో పనులు పూర్తి కాలేదు. గుండాల ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్‌కు ముగ్గు పోసినప్పటికీ పనులు మొదలు కాలేదు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నీటి సౌకర్యం, మూత్రశాలలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

స్వరాష్ట్రంలోనే మహిళలకు గుర్తింపు



మహిళా సంక్షేమ దినోత్సవంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

ఆత్మకూరు(ఎం) : తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే మహిళలకు గుర్తింపు వచ్చిందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆత్మకూర్ (ఎం) మండల కేంద్రంలో జరిగిన ఆలేరు నియోజకవర్గ స్థాయి మహిళా సంక్షేమ దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రత్యేకంగా పథకాలు అమలు చేయడం వల్ల ఈ రోజు మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని తెలిపారు. మహిళల భద్రతకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత శిశు, మాతృ మరణాల రేటు తగ్గినట్లు వెల్లడించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ హయాంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ విప్ లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ మోత్కూరు ప్రాజెక్టు సీడీపీఓ జోత్స్న అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీపీఓ సునంద, ఎంపీపీ తండ మంగమ్మశ్రీశైలం, జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, మండల ప్రత్యేక అధికారి రాజారామ్, ఐసీడీఎస్ పీడీ చందనేశ్వరి, ఎంపీపీలు తాండ్ర అమరావతి, ఇందిర మోటకొండూరు, యాదగిరిగుట్ట జెడ్పీటీసీలు పల్లా వెంకట్‌రెడ్డి, తోటకూర అనురాధ, ఆత్మకూరు(ఎం) సర్పంచ్ జన్నాయికోడె నగేష్, ఎంపీటీసీ యాస కవిత, బీసు ధనలక్ష్మి, ఎంపీడీఓ బండారు యాదగిరి, తహసీల్దార్‌లు జయమ్మ, జ్యోతి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ సునీత, కలెక్టర్ పమేలా సత్పతి

వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే..

- ప్రజల కష్టాలన్నీ తీరుతాయి
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- గుర్రంపోడు మండలంలో కొనసాగిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర



గుర్రంపోడులో కొనసాగుతున్న భట్టి విక్రమార్క పాదయాత్ర

గుర్రంపోడు: వచ్చేది ఇందిరమ్మ రాజ్యమేనని..మీ కష్టాలన్నీ తీరుతాయని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రజలకు భరోసా ఇచ్చారు. గుర్రంపోడు మండలంలో ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం కొనసాగింది. ఉదయం జిన్నాయిచింత స్టేజి వద్ద ప్రారంభమైన పాదయాత్రలో భాగంగా రోడ్డు వెంట ఉన్న కూలీలను, మహిళలను, వృద్ధులను పలుకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. వద్దిరెడ్డిగూడెం వద్ద రోడ్డు పక్కన గీతకార్మికుడు రాజు, జ్యోతి దంపతులు గీత కార్మికులకు చెట్లు ఎక్కాలంటే కష్టంగా ఉందని 45 ఏళ్లకే ఫించన్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. వద్దిరెడ్డిగూడెం గ్రామంలో జరిగిర రచ్చ బండలో రైతులు వద్దిరెడ్డి ఈశ్వరమ్మ, భద్రారెడ్డి, సిద్దారెడ్డి, మేకల కృష్ణారెడ్డి తదితరులు సీఎల్పీ నేతతో మాట్లాడుతూ తమకు రుణమాఫీ కాలేదని, మాఫీ అవుతుందని వడ్డీ కట్టలేదని, తీసుకున్న అప్పు వడ్డీతో సహా మాఫీ చేయాలని కోరారు. పండించిన పంటకు మద్దతు ధర లేదని, ఎరువుల ధరలు పెరిగి సేద్యం భారంగా మారిందని పలువురు రైతులు తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో మీకు మేలు జరుగుతుందని, రూ. రెండు లక్షల రుణమాఫీ ఏకకాలంలో జరుగుతుందని హామీ ఇచ్చారు. రైతుబంధులాగా కూలీబంధు ఇస్తామని, ప్రతి కుటుంబానికి 12 వేల సాయం అందిస్తామని పేర్కొన్నారు. ఇల్లు లేని ప్రతి కుటుంబానికి రెండు గదుల ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం అందిస్తామని భరోసా కల్పించారు. ఇప్పుడున్న వంట గ్యాస్ ధర 1,200 రూపాయల బదులు రూ.500లకే సిలిండర్ అందిస్తామన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన విధంగా 9 రకాల రేషన్ సరకులు ఇస్తామని అన్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేసి గ్రావిటీ ద్వారా సాగునీరు అందిస్తామని చెప్పారు. పాదయాత్రలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు కుందూరు జయవీర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, కుప్ప రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ సూదిని జగదీశ్వర్‌రెడ్డి, జాల చినసత్తయ్య యాదవ్, మేడి వెంకన్న, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సంకెళ్లు సిగ్గుచేటు

- డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి



రైతులను సన్మానిస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : న్యాయం కోసం పోరాడుతున్న రైతులకు సంకెళ్లు వేసి అరెస్ట్ చేయడం సిగ్గుచేటని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన భువనగిరిలో విలేకరులతో మాట్లాడారు. మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆదేశాలతోనే రైతులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి, అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రైతులకు కానుకగా బేడీలు వేశారా అని పశ్నించారు. రైతుల మీద పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తప్పిదాన్ని కప్పిపుచ్చేందుకు పోలీసులు అరెస్ట్ అయిన వారు రైతులు కారని చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాయిగిరికి వచ్చి చూస్తే వారు రైతులో కారో తెలుస్తుందన్నారు. అనంతరం రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని పోరాడి జైలుకు వెళ్లి వచ్చిన రైతులను స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద ఘనంగా స్వాగతం పలికారు. రైతులు చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీసుకుంట్ల సత్యనారాయణ, పాశం శివనంద్, కైరం కొండ వెంకటేశం, ఏడమ పవన్ ఉన్నారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

భువనగిరి : టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో భువనగిరి నాలుగు, చౌటుప్పల్‌లో రెండు కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో జరిగే పరీక్షలకు మొత్తం 1800 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు ఆరుగురు సీఎస్, డీఓలను ఏర్పాటు చేశారు. వీరితో పాటు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాన్ని నియమించారు. ఈ పరీక్షలు ఈ నెల 20వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

ఎక్కడ చూసినా 'టు లెట్' బోర్డులే !

- చౌటుప్పల్ పట్టణంలో ఖాళీ ఇళ్లు దర్శనం
- పిల్లల చదువులకు కుటుంబాలు నగరం బాట పట్టడమే కారణం
- నెలలు గడుస్తున్నా అద్దెకు రాని కొత్తవారు
- ఇళ్ల యజమానులకు బ్యాంకుల ఈఎంఐ కష్టాలు



సింగిల్ బెడ్రూం ఖాళీ ఉందని బోర్డు పెట్టిన ఇల్లు

చౌటుప్పల్ : జాతీయ రహదారిపై దినదినాభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో చౌటుప్పల్ ఒకటి. పలు మండలాలకు కూడలిగా ఉండడంతో పాటు ఎన్నో పరిశ్రమలకు కేంద్రంగా గుర్తింపు పొందింది. అటు నల్లగొండ, ఇటు హైదరాబాద్‌కు మధ్య ఉండడంతో శరవేగంగా అభివృద్ధి చెందింది. దీంతో గతంలో కుదించి ఉన్న పట్టణ కేంద్రం ఇప్పుడు నలుమూలలుగా విస్తరించింది. ఎటు చూసినా సుమారుగా రెండు కిలోమీటర్ల మేరకు ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. అయితే, పిల్లల చదువులు, ఉపాధి నిమిత్తం చాలా మంది హైదరాబాద్ బాట పట్టడంతో ఊరంతా ఖాళీ ఇళ్లే దర్శనమిస్తున్నాయి, ఎటు చూసినా టులెట్ బోర్డులే దర్శనమిస్తున్నాయి.

వ్యాపార, పారిశ్రామిక కేంద్రంగా గుర్తింపు

చౌటుప్పల్ మండలం వివిధ రకాల వ్యాపార, పారిశ్రామిక కేంద్రంగా ప్రత్యేకమైన గుర్తింపు పొందింది. 1990 సంవత్సరం నుంచే ఇక్కడ పరిశ్రమల శకం ప్రారంభమైంది. మండలంలోని చౌటుప్పల్, లింగోజిగూడెం, మల్కాపురం, పంతంగి, మందోళ్లగూడెం, ఎస్.లింగోటం, జైకేసారం, అంకిరెడ్డిగూడెం, తూప్రాన్‌పేట, ఆరెగూడెం, కొయ్యలగూడెం, ధర్మోజిగూడెం, దేవలమ్మనాగారం, తంగడపల్లి, ఖైతాపురం, ఎల్లగిరి గ్రామాల్లో 100వరకు పరిశ్రమలు ఉన్నాయి.

నెలల తరబడి ఖాళీగా..

చౌటుప్పల్ గతంలో సింగిల్‌గానే ఉండేది. మరో నాలుగు గ్రామాలైన లింగోజిగూడెం, తాళ్లసింగారం, తంగడపల్లి, లక్కారంతో కలిసి 2018లో మున్సిపాలిటీగా అవతరించింది. ఇందులో తంగడపల్లి, లక్కారం గ్రామాల్లో సగభాగం గత పదేళ్లుగా కలిసిపోయే ఉన్నాయి. మిగిలిన లింగోజిగూడెం, తాళ్లసింగారం దూరంగా ఉంటాయి. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో 8,030 నిర్మాణాలు(ఇండ్లు, దుకాణ సముదాయాలు) ఉన్నాయి. వీటిలో పట్టణ కేంద్రంతోపాటు కలిసిన గ్రామాల్లోని ఇండ్లు కలిపి సుమారుగా 7వేల వరకు ఉంటాయి. అందులో దాదాపుగా 5వేల ఇండ్లు అద్దెలకు ఇస్తున్నవే ఉంటాయని అంచనా. ఇప్పుడు ఈ ఇండ్లు చాలా మేరకు ఖాళీగా ఉన్నాయి. ఎక్కడ చూసినా టులెట్ బోర్డులే కనిపిస్తున్నాయి. నెలల తరబడి వేచి చూసినా కొత్త వారు రావడంలేదు.

నివాసానికి అనుగుణంగా..

మండలంతో పోలిస్తే పట్టణ కేంద్రం అన్ని రకా లుగా అందరికీ అనువుగా ఉంది. ఇక్కడికి మండలంతో పాటు నారాయణపురం, చండూరు, మునుగోడు, చిట్యాల, రామన్నపేట, వలిగొండ, పోచంపల్లి మండలాలకు చెందిన వివిధ వర్గాల ప్రజలు జీవనోపాధి పొందుతూ స్థానికంగానే నివాసం ఉంటున్నారు. వీరితోపాటు పరిశ్రమల్లో పనిచేసే వేలాదిమంది ఉద్యోగులు, కార్మికులు అత్యధికంగా ఇక్కడే నివసిస్తున్నారు. అద్దెకు వస్తున్న కుటుంబాల అభిరుచుల మేరకు చాలా మంది ఇంటి యజమానులు తమ ఇళ్లను ఒక అంతస్తు నుంచి ఐదు అంతస్తుల్లో అన్ని హంగులతో నిర్మించారు. ఏరియా డిమాండ్ మేరకు ఒక్కో గదికి 1000–2000వరకు, సింగిల్ బెడ్‌రూంకు 5వేల నుంచి 8వేల వరకు అద్దెలు ఉన్నాయి. రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన నిర్మాణాల ద్వారా వచ్చే అద్దెలపైనే అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

హైదరాబాద్‌కు మకాం మారుస్తున్న అత్యధిక కుటుంబాలు

గతంతో పోలిస్తే పట్టణంలో ఖాళీ ఇండ్ల సమస్య అత్యధికంగా ఉంది. రెండు దశాబ్దాల కాలంలో ఎప్పుడూ చూడని విధంగా నెలల తరబడి ఖాళీ ఇండ్లు ఇప్పుడు దర్శనం ఇస్తున్నాయి. ఆర్థికంగా ఓ స్థాయి కలిగిన కుటుంబాలు ఇక్కడి నుంచి మకాంను హైదరాబాద్‌కు మారుస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం పిల్లల విద్యాభ్యాసమేనని చెప్పవచ్చు. పరిశ్రమల్లో పని చేస్తున్న ఉద్యోగులు కూడా చాలా వరకు ఈ ఏడాది ఇక్కడి నుంచి వెళ్లిపోయారు.

పిల్లల చదువుల కోసమే ..



మాది ఇదే ఊరు. ఇక్కడే ఇళ్లు, వ్యవసాయ పొలాలు ఉన్నాయి. స్థానికంగా ఓ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నా. ప్రస్తుతం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నా. రోజు ఇక్కడికి వచ్చి వెళ్తుంటా. స్థానికంగా అన్ని రకాలుగా ఆనందంగానే ఉన్నప్పటికీ సరైన విద్యాసంస్థలు అందుబాటులో లేవు. పిల్లల చదువుల కోసం ఇక్కడి నుంచి వెళ్లిపోవాల్సి వచ్చింది. –సందగళ్ల నాగరాజు, చౌటుప్పల్

నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోంది



మాకు స్థానికంగా రెండు అంతస్తుల్లో ఇల్లు ఉంది. కొన్నేళ్లుగా కొంతభాగం అద్దెకు ఇస్తుంటాము. అద్దెకు ఉన్న వ్యక్తులు ఇల్లు ఖాళీ చేసి వెళ్తే తిరిగి అద్దెకు రావాలంటే చాలా రోజుల సమయం పడుతుంది. నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తుంది. దీంతో తమకు వివిధ రకాల చెల్లింపులకు ఇబ్బందిగా మారుతోంది.

–అవిరేను రమేష్, ఇంటి యజమాని, చౌటుప్పల్

కొండమడుగు భూ కుంభకోణంపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

బీబీనగర్: బీబీనగర్ మండలం కొండమడుగులోకి ఇటీవల వెలుగుచూసిన భూ కుంభకోణంపై అధికారులు విచారణ ప్రారంభించారు. నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి విలువైన నాలుగు ఎకరాల భూమిని కాజేసీ మరో ఆరు ఎకరాలను ఆక్రమించేందుకు యత్నిస్తున్న తీరుపై 'రూ.50కోట్ల భూమికి ఎసరు' శీర్షికన సాక్షి దినపత్రిలో ఈ నెల 10న కథనాన్ని ప్రచురించింది. దీనిపై అధికారులు విచారణ చేపట్టాలంటూ బీబీనగర్ పోలీస్ స్టేషన్‌లో రాంపల్లి రమేష్ (అప్పట్లో వసంతకు భూమిని విక్రయించిన వ్యక్తి) ఫిర్యాదు చేశాడు. గ్రామంలో గల 591,92,95 సర్వే నంబర్లలోని ఆ భూమి తమదేనంటూ వసంత పేరు గల నలుగురు మహిళలు రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడంపై అధికారులు ఆరా తీస్తున్నారు. రమేష్ ఫిర్యాదు మేరకు 420,468,471 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగేంధర్ తెలిపారు.

క్లుప్తంగా

నాలుగు స్కూల్ బస్సులపై కేసులు నమోదు



కేసులు నమోదు చేస్తున్న డీటీఓ సురేందర్‌రెడ్డి

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలో రవాణా శాఖ అధికారులు మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. డీటీఓ సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో సరైన ఫిట్‌నెస్ లేకుండా, అర్హత లేని వ్యక్తులతో డ్రైవింగ్ చేయిస్తున్న రెండు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన నాలుగు బస్సులను గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశారు. బస్సులను భువనగిరిలోని రవాణా శాఖ కార్యాలయానికి తరలించారు.

చెరువులో పడి విద్యార్థి మృతి



సాయితేజ (ఫైల్)

ఆలేరురూరల్: చెరువులో పడి విద్యార్థి మృతిచెందిన ఘటన ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరు గ్రామానికి చెందిన కటికె వెంకటేష్ కుమారుడు కటికె సాయితేజ(14) ఆలేరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం సాయితేజ్ పశువులకు మేత వేయడానికి తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో సమీపంలో ఉన్న చెరువు ఒడ్డున కాలకృత్యాలు తీర్చుకుంటుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఉదయం 10గంటలు అవుతున్నా కొడుకు ఇంటికి రాకపోవడం, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండడంతో తండ్రి వెంకటేష్ వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. సమీపంలోని చెరువు కట్టపై సాయితేజ చెప్పులు, సైకిల్ కనిపించడంతో విషయాన్ని వెంటనే గ్రామస్తులకు తెలియజేశాడు. గ్రామస్తులు వచ్చి చెరువులో గాలించగా సాయితేజ మృతదేహం బయటపడింది. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ జి. వెంకటశ్రీను తెలిపారు.

వైభవంగా నారసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్రనామార్చన, కుంకుమార్చనలు గావించారు. అదేవిధంగా నూతన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తిగట్టించారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకుల పూజ, ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు పద్మనాభాచార్యులు, లక్ష్మీ నరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

- మరో వ్యక్తికి తీవ్రగాయాలు
- డీసీఎంను వెనుక నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ఘటన



ఘటనా స్థలంలో అశోక్ మృతదేహం



ప్రమాదానికి కారణమైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

మునగాల(కోదాడ): మునగాల మండలంలోని మాధవరం శివారులో మంగళవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మునగాల ఎస్ఐ పి. లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఉషోదయ జ్యోతి యాడ్స్ సంస్థలో ఫ్లెక్సీ వర్కర్‌గా పనిచేస్తున్న ముష్టం అశోక్(29) హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడేనికి ఉషోదయ సూపర్ మార్కెట్‌కు సంబంధించిన డీసీఎం(టీఎస్ 08 యూజీ 5886)లో నిత్యావసర సరుకులు తీసుకొని వెళ్తున్నాడు. మార్గమధ్యలో మునగాల మండలం మాధవరం గ్రామ శివారులోకి రాగానే డీసీఎంను వెనుక నుంచి ఇంటర్‌సిటీ ప్రైవేట్ ట్రావెల్ బస్సు (టీఎస్ 12 యూడీ 9638) ఢీకొట్టింది. దీంతో డీసీఎం జాతీయ రహదారి పక్కనే ఉన్న గుంతలో పడిపోయింది. ఈ ప్రమాదంలో అశోక్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా, డీసీఎంలోనే ఉన్న మరో వ్యక్తి హనుమాచారికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం అశోక్ మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి, చికిత్స నిమిత్తం హనుమాచారిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు ముష్టం కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

చౌటుప్పల్: మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం సంగెం గ్రామానికి చెందిన తాడూరి లింగస్వామి(33) దండు మల్కాపురంలోని ఇండస్ట్రీయల్ పార్కులో పనిచేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి డ్యూటీ ముగించుకున్న తర్వాత లింగస్వామి ఇండస్ట్రీయల్ పార్కు సమీపంలోనే జాతీయ రహదారిపై అవతలి వైపు ఉన్న ఆంథోల్ మైసమ్మ ఆలయం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇటు వైపు వచ్చేందుకు హైవే దాటుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మంగళవారం మృతుడి తండ్రి శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

లారీ వెనుక టైర్ల కింద పడి..

దేవరకొండ: లారీ వెనుక టైర్ల కిందపడి డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన సోమవారం రాత్రి దేవరకొండ పట్టణ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన మల్లె వెంకటేశ్వర్‌రావు(30) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం లారీలో సర్ఫ్ లోడ్‌తో జడ్చర్ల నుంచి విజయవాడకు బయల్దేరాడు. రాత్రి 10:30గంటల సమయంలో దేవరకొండ పట్టణ శివారుకు చేరుకోగానే లారీ ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో లారీ అదుపుతప్పి ఎడమ వైపుకు వెళ్లింది. డ్రైవర్ సీట్లో ఉన్న వెంకటేశ్వర్‌రావు తన పక్కన ఉన్న డోర్ పెట్టకపోవడంతో కుడి పక్కకు పడిపోయాడు. దీంతో లారీ వెనుక టైర్లు అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి సీతారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని మున్సిపల్ ఉద్యోగి బలవన్మరణం

- ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడని భార్య ఫిర్యాదు

నల్లగొండ క్రైం: ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరేసుకుని మున్సిపల్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం నల్లగొండ పట్టణంలోని బీటీఎస్ దుర్గాకాలనీలో చోటుచేసుకుంది. వన్ టౌన్ సీఐ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. బీటీఎస్ దుర్గాకాలనీకి చెందిన పప్పుల ఓంప్రకాష్(53) నల్లగొండ మున్సిపాలిటీలో వాటర్ ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. తన సహచర ఉద్యోగి చింత ఎల్లయ్య శ్రీరాం చిట్‌ఫండ్ కంపెనీలో డబ్బులు అప్పుగా తీసుకోగా ఓంప్రకాష్ షూరిటీ సంతకం చేశాడు. కాగా ఎల్లయ్య సక్రమంగా డబ్బులు చెల్లించకపోవడంతో ఇటీవల ఓంప్రకాష్ బ్యాంక్ ఖాతా నుంచి రూ.10వేలు కట్ చేశారు. అయితే ఓంప్రకాష్ కుమార్తె గర్భవతి కావడంతో ఆమెకు వైద్యం చేయించేందుకు అతడి భార్య పప్పుల లక్ష్మమ్మ హైదరాబాద్‌కు వెళ్లింది. మంగళవారం ఓంప్రకాష్ కుమారుడు చరణ్‌తేజ స్నేహితులను కలిసేందుకు బయటకు వెళ్లాడు. అదే సమయంలో ఓంప్రకాష్ ఇంట్లో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చిన చరణ్‌తేజ్ ఎంత కొట్టినా తలుపులు తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఓంప్రకాష్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే చరణ్‌తేజ్ తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికే ఓంప్రకాష్ మృతిచెందాడు. చరణ్‌తేజ్ ఈ విషయాన్ని తల్లికి, పోలీసులకు ఫోన్ ద్వారా తెలియజేశాడు. కాగా ఆర్థిక ఇబ్బందులతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతిడి భార్య లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

గేదెల చోరీ కేసులో నలుగురు అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామలింగారెడ్డి

హుజూర్‌నగర్: గేదెల దొంగతనానికి పాల్పడుతున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ రూ3.50లక్షల నగదు, నాలుగు గేదెలను స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని తన కార్యాలయంలో సీఐ రామలింగారెడ్డి విలేకరులకు వివరించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన అమరబోయిన మట్టపల్లి ఈ నెల 3వ తేదీన తన నాలుగు గేదెలు పోయాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలోని గామలపహాడ్‌కు చెందిన వారిని విచారించారు. విచారణలో భాగంగా దాచేపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ చాట్ల శరత్, గమలపహాడ్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గోనె రామారావు, సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం నర్లింగులగూడేనికి చెందిన మాలమంతి మోహన్‌రావు, దాచేపల్లి మండలం ఇర్కిపల్లికి చెందిన మల్లా నాగరాజు, ఒంగోలు జిల్లా టంగుటూరు మండలం కరుమంచుకు చెందిన పార్థి శ్రీకాంత్, దాచేపల్లి మండలం గామాలపహాడ్‌కు చెందిన ఆటో డ్రైవర్ అలంకెమల్ల నాగేంద్ర బాబు, షేక్ బాజీ, గోనె సైదారావు కలిసి గేదెల దొంగతనానికి పాల్పడుతున్నారని తేల్చారు. వీరిలో చాట్ల శరత్, గోనె రామారావు, మాలమంతి మోహన్‌రావు, మల్లా నాగరాజును మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరిని విచారించగా తాము 8మంది కలిసి హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మఠంపల్లి, పాలకవీడు, హుజూర్‌నగర్, మేళ్లచెరువు మండలాల్లోని వివిధ గ్రామాలలో గేదెలను దొంగిలించి బొలేరో, టాటా ఏస్ వాహనాలలో ఆంధ్రప్రదేశ్‌కు తీసుకెళ్లి అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు గేదెలు, రూ.3.50లక్షల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ తెలిపారు. మిగతా వారు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో మఠంపల్లి, హుజూర్‌నగర్ ఎస్ఐలు బాలకృష్ణ, వెంకటరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటిని చుట్టుముట్టిన మంటలు



ట్యాంకర్ సహాయంతో మంటలు ఆర్పుతున్న స్థానికులు

పాలకవీడు: వరి కొయ్యలను తగలబెట్టేందుకు పొలాల్లో వేసిన మంటలు సమీపంలోని ఇంటిని చుట్టుముట్టాయి. ఈ ఘటన పాలకవీడు గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తులు తమ పొలాల్లో వరి కొయ్యలకు నిప్పుపెట్టగా.. మంటలు సమీపంలోని ఇంటిని చుట్టుముట్టాయి. స్థానికులు ట్యాంకర్ సాయంతో మంటలను అదుపు చేశారు. అదే విధంగా విద్యుత్ వైరుకు మంటలు అంటుకుని తెగిపడడంతో వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. పొలాల్లో పంట వ్యర్థాలకు నిప్పు పెట్టడం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు.

దత్తాయపల్లిలో ఇద్దరు చిన్నారుల అదృశ్యం



పిట్టల విజయ్



పిట్టల చరణ్

తుర్కపల్లి: మండలంలోని దత్తాయపల్లిలో మంగళవారం ఇద్దరు చిన్నారులు అదృశ్యమయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా మునిరాబాద్ మండలం దండుపల్లి గ్రామానికి చెందిన దీవిందర్‌రావుకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య యాదమ్మకు ఇద్దరు కుమారలు విజయ్(15), చరణ్(9) సంతానం కాగా, రెండో భార్య స్వరూపకు ఇద్దరు కుమార్తెలు సంతానం. యాదమ్మ బతుకుదెరువు నిమిత్తం పెద్ద కుమారుడు విజయ్‌తో కలిసి తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి గ్రామానికి వలస వచ్చి స్థానికంగా కోళ్లఫారంలో పనిచేస్తుంది. దీవిందర్‌రావు ఇద్దరు భార్యల వద్దకు వచ్చి వెళ్తుండేవాడు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం దీవిందర్‌రావు ప్రమాదవశాత్తు చింతచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. అప్పటివరకు యాదమ్మ చిన్న కుమారుడు చరణ్ మునిరాబాద్‌లో స్వరూప దగ్గర ఉండగా, అతడిని కూడా దత్తాయపల్లికి తీసుకువచ్చింది. కాగా విజయ్, చరణ్ మంగళవారం సాయంత్రం 3గంటల వరకు తల్లితోనే కోళ్లఫారం ఉన్న పిల్లలిద్దరూ.. తల్లి నిద్రపోతున్న సమయంలో ఇంటి ముందు ఉన్న టీవీఎస్ ఎక్సెల్ బండితో పాటు ఇంట్లోని రూ.2వేలు తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయారు. సాయంత్రం వరకు వారు ఇంటికి తిరిగి రాకపోవడంతో యాదమ్మ చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. బంధువులకు ఫోన్ చేసి అడిగినా పిల్లల సమాచారం తెలియరాలేదు.

వ్యక్తిపై గొడ్డలితో హత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీను

మర్రిగూడ: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల వైన్స్‌ల వద్ద మంగళవారం రాత్రి 9.30గంటల సమయంలో వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. స్థానిక ఎస్ఐ కె. రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చర్లగూడెం గ్రామానికి చెందిన బండ శ్రీను మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల వైన్స్‌ల వద్ద ఉండగా.. అదే సమయంలో చర్లగూడెం గ్రామానికే చెందిన అతడి స్నేహితుడు మాదగోని శ్రీను, రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీకి చెందిన శ్రవణ్‌తో కలిసి గొడ్డలితో బండ శ్రీనుపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన బండి శ్రీనును మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బండ శ్రీను తండ్రి సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాదాద్రి కొండపై రెండు దుకాణాలు సీజ్

- ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు వాటర్ బాటిళ్లు అమ్ముతుండడంతో చర్యలు



వివరాలు నమోదు చేసుకుంటున్న లీగల్ మెట్రాలజీ జిల్లా ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కృష్ణ

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలోని బస్టాండ్, విష్ణు పుష్కరిణి వద్ద వర్తక సంఘం దుకాణాలపై లీగల్ మెట్రాలజీ జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎస్. సంజయ్‌కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. భక్తుల వద్ద వాటర్ బాటిల్‌పై ఉన్న ఎమ్మార్పీ ధర కంటే అదనంగా రూ.5 వసూలు చేయడంతో వర్తక సంఘానికి చెందిన రెండు దుకాణాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాటర్ బాటిల్‌పై అదనంగా రూ.5 వసూలు చేస్తున్నారని తమకు ఫిర్యాదులు అందాయని, ఈ మేరకు జిల్లా లీగల్ మెట్రాలజీ సిబ్బందితో కలిసి కొండ పైకి చేరుకొని రెండు దుకాణాల్లో వాటర్ బాటిల్స్ కొనుగోలు చేయగా.. రూ.20 ఉన్న బాటిల్‌పై అదనంగా రూ.5 వసూలు చేయడంతో వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. కాగా నెల రోజుల క్రితమే వాటర్ బాటిల్‌పై భక్తుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని సాక్షి దినపత్రికలో ''నారసింహా.. ఇదేమి దోపిడీ'' శీర్షికన కథనం ప్రచురితం కావడం గమనార్హం.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



వీరమల్లయ్య మృతదేహం

గుండాల: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన ఏనుగు వీరమల్లయ్య(63) రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చేతులు, నడుము నొప్పులతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. నొప్పుల బాధ భరించలేక జీవితంపై విరక్తి చెందిన వీరమల్లయ్య ఈ నెల 11న తన వ్యవసాయ బావి వద్ద గడ్డి మందు తాగి తన తమ్ముడి కుమార్తె సంతోషకు ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. ఆమె అదే గ్రామానికి చెందిన మాటూరి కాశయ్య, గుజ్జ కొమురయ్యకు విషయం తెలియజేసింది. వారు వెంటనే వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా అప్పటికే వీరమల్లయ్య అపస్మారక స్థితిలో ఉండగా, అతడిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మంగళవారం మృతుడి భార్య మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

అరెస్టయిన వారిలో రైతులు లేరు



మాట్లాడుతున్న భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి: రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని గత నెల 30న యాదాద్రి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసిన వారిని పోలీసులు అరెస్ట్ చేయగా, వారిలో రైతులు ఎవరూ లేరని భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర అన్నారు. మంగళవారం రాత్రి డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆందోళన చేసిన వారిలో నలుగురిని అరెస్టు చేశామని, వారిలో జమ్మాపురంలోని ఓ కంపెనీలో పనిచేసే వ్యక్తి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు కొనుగోలు చేసిన తన 20 గుంటల భూమిలో కొంత రీజినల్ రింగ్ రోడ్డులో పోతుండడంతో ఆందళనలో పాల్గొన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిందని పేర్కొన్నారు. మిగతా వారు రైతులు కాదని అన్నారు. సహజంగా నేరస్తుల ప్రవర్తనను బట్టి వారిని ఎంతమంది బందోబస్తు నడుమ తీసుకెళ్లాలో నిర్ణయించబడుతుందని అన్నారు. ఈ మేరకు రిమాండ్‌లో ఉన్న నలుగురు రైతులను మంగళవారం నల్లగొండ నుంచి భువనగిరి కోర్టుకు తీసుకొచ్చే క్రమంలో ప్రొటోకాల్ పాటించాల్సి వచ్చిందన్నారు. వీరిని కోర్టుకు తీసుకొచ్చే క్రమంలో ఎస్కార్ట్ సిబ్బందిని కూడా ఇబ్బంది పెట్టినట్లు తెలిసిందన్నారు. అయినప్పటికీ మీడియాలో వస్తున్న అభ్యంతరాలను దృష్టి ఉంచుకొని బందోబస్తులో ఉన్న పోలీసులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

గిరిప్రదక్షిణ రోడ్డుకు మరమ్మతులు

- యాదగిరికొండ దిగువన ఫుట్‌పాత్ టైల్స్ నిర్మాణం
- వర్షం, డ్రెయినేజీ నీరు సాఫీగా వెళ్లేలా పైప్ పనులు



గిరి ప్రదక్షిణ రోడ్డులో వేస్తున్న డ్రెయినేజీ పైప్‌లైన్

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కొండకు దిగువన ఉన్న గిరి ప్రదక్షిణ రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. ప్రతి నెలలో వచ్చే స్వామివారి జన్మనక్షత్రం రోజున యాదగిరిగుట్ట పట్టణంతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల భక్తులు గిరి ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. గతంలో ఈ రోడ్డంతా మట్టి, గుంతలు, రాళ్లు, రప్పలతో ఉండేది. భక్తుల ఇబ్బందులను గమనించిన ఆలయాధికారులు 4కిలో మీటర్లకు పైగా ఫుట్‌ఫాత్ టైల్స్ వేస్తున్నారు. గకొండపైన వర్షం, డ్రెయినేజీ నీరు కిందకు వచ్చే క్రమంలో గిరి ప్రదక్షిణ రోడ్డు అస్తవ్యస్తంగా మారడంతో పాటు దుర్వాసన వస్తోంది. దీంతో అటు గిరి ప్రదక్షిణ చేసే భక్తులు, అక్కడే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండపై నుంచి వచ్చే నీరు నేరుగా ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న డ్రెయినేజీలోకి వెళ్లే విధంగా పైప్‌లైన్ పనులు చేస్తున్నారు. గిరి ప్రదక్షిణతో పాటు సైడ్ డ్రెయినేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు వేగంగా పనులు చేయిస్తున్నారు.

శ్రీతిరుమలనాథ స్వామి పునఃప్రతిష్ఠాపనోత్సవాలు



ప్రవచిస్తున్న చిన జీయర్‌స్వామి

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి గ్రామంలో గల శ్రీతిరుమలనాథ స్వామి ఆలయంలో స్వామి పునఃప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం కర్మాంగ స్నపనము, నయనోన్మీలనము, సాయంత్రం శయాధివాసము చేశారు. అనంతరం రాత్రి త్రిదండి చిన జీయర్‌స్వామి శ్రీతిరుమలనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో దివ్య ప్రవచనాలు భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో మచ్చ శ్రీనివాస్‌గౌడ్, బల్‌రాంగౌడ్, మల్లాగౌడ్, మచ్చ శ్రీదేవి చంద్రమౌళిగౌడ్, సర్పంచ్ మచ్చ వసంతా శ్రీనివాస్‌గౌడ్, ప్రీతమ్‌గౌడ్, ఆలయ కమిటీ ఛైర్మన్ రాగుల బల్‌రాం, ఈఓ నరేందర్, ఆలయ అర్చకులు కాండూరి లక్ష్మీనారసింహాచార్యులు, రంగారామాగౌడ్, మహేష్, రామచంద్రయ్యగుప్త, జమాల్, నాగరాజు, శ్రీనివాసరావు, నర్సింహా, శెట్టిగౌడ్, సాయిగౌడ్ పాల్గొన్నారు.

రైతులను సంకెళ్లతో తీసుకురావడం అమానుషం

భువనగిరి : ట్రిపుల్ ఆర్ బాధిత రైతుల చేతులకు సంకెళ్లు వేసి భువనగిరి పీడీఎం కోర్టులో హాజరు పర్చేందుకు తీసుకురావడం అమానుషమని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. భూముల కోసం పోరాటం చేస్తున్న రైతులకు సంకెళ్లు వేసి కోర్టులో హాజరు పర్చడం సమజసం కాదన్నారు. రైతులను పోలీసులు ఉగ్రవాదుల్లా చూస్తున్నారని, ప్రజాస్వామ్య దేశంలో భూముల కోసం పోరాటం చేస్తున్న రైతులను దొంగలుగా, హత్యలు చేసిన వారిగా చూడడం సరికాదన్నారు. రైతు సంక్షేమ ప్రభుత్వం అని చెప్పుకుంటూ రైతులకు సంకెళ్లు వేయడం వారిపైన ప్రేమ ఎంతో తెలుస్తుందన్నారు.

అదును చూసి విత్తనాలు విత్తుకోవాలి

- పంటల సాగుపై నడిగూడెం ఏఓ రాజగోపాలరావు సూచనలు



దుక్కి దున్నుతున్న రైతు

పాడి పంట

నడిగూడెం : రైతు సాగు చేసే ఏ పంటకైనా అదునులోగా విత్తనాలు విత్తుకుంటే మేలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు చెబుతున్నారు. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే వరి, పత్తి పంటల విత్తనాలు విత్తుకునే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంటల సాగు, విస్తీర్ణం, దిగుబడులు నైరుతి రుతుపవనాల ప్రవేశంపై ఆధారపడి ఉంటాయి. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ వారంలో ప్రవేశించి, మూడో వారం వరకు అంతటా విస్తరిస్తాయి. నైరుతి రుతుపవనాల ప్రవేశం ఆధారంగా వానాకాలంలో పత్తి, కంది, పెసర, ఇతర పంటలను విత్తుకుంటారు.

వర్షాలపై ఆధారపడి పత్తి సాగు

పత్తి విత్తనాలను వర్షాలపై ఆధారపడి విత్తుకోవాలి. తెల్లబంగారం సాగు చేసే రైతులు ఏటా అదే పొలంలో పత్తిని పండించకుండా పంట మార్పిడి చేయాలి. విత్తనాలను మొక్కకు మధ్య 2అడుగులు వరుస వరుసకు 2 అడుగులు లేదా మొక్కకు 3అడుగుల దూరంలో వరుస వరుసకు 3 అడుగుల దూరంలో విత్తుకోవడం ద్వారా సాంద్రతను పెంచి అధిక దిగుబడులు పొందవచ్చు. నల్లరేగడి భూముల్లో 60-70 మి.మీ. ఎర్ర చెల్క భూముల్లో 50-60 మి.మీ. వర్షపాతం నమోదైనప్పుడు విత్తుకోవాలి. జూలై 15లోగా విత్తుకుంటే ఆశించిన దిగుబడులు పొందవచ్చు. సిఫారసు చేసిన భాస్వరం మొత్తాన్ని సింగిల్‌సూపర్ పాస్పేట్ రూపంలో 150కిలోలు ఆఖరు దుక్కిలో విత్తేటప్పుడు వాడాలి. మెగ్నిషియం, బోరాన్ తదితర సూక్ష్మదాతులోప నివారణకు మెగ్నిషియం పది గ్రాములు, బోరాన్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు మందులైన ఇమిడాక్లోప్రిడ్ 5 గ్రాములు లేదా థయోమిథాక్సోం 4 గ్రాములు, తెగుళ్ల నివారణకు వినియోగించే ట్రికోడెర్మా విరిడే 10 గ్రాములు, సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ 10 గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. ప్రైవేట్ హైబ్రిడ్ విత్తనాలైతే శిలీంధ్రనాశిని మందులు కార్బెక్సిన్+థైరమ్ 25 గ్రాములు కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. అంతరపంటగా కందిని ఆరు లేదా ఎనిమిది వరుసలకు విత్తుకోవాలి.

వరి సాగుకు అనుకూలమైన సమయం

దీర్ఘకాలిక రకాలైన బీపీటీ-5204 ఇంకా ఇతర సన్న రకాలు ఇప్పటి నుంచి జూన్ నెలాఖరులోగా నారు పోసుకోవచ్చు. స్వల్పకాలిక రకాలైతే జూన్ 20నుంచి, జూలై 15వరకు నారు పోసుకోవచ్చు. ఆర్ఎన్ఆర్ 15048 రకం కొంత ఆలస్యమైనా పోసుకొనేందుకు అనువైంది.

జూలై 15లోగా విత్తుకోవాలి

కంది, పెసర పంటలను ఈ నెల 15 నుంచి జూలై 15లోగా విత్తుకోవాలి. పంట మార్పిడి పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. కంది తర్వాత జొన్న, మినుము, ఉలువలు నువ్వులు తదితర పంటలు సాగు చేసుకోవచ్చు. పురుగులు, తెగుళ్లు తట్టుకొనే రకాలు సాగు చేసుకోవాలి. కంది పంట చుట్టూ అక్కడక్కడ బంతి మొక్కలు నాటుకోవాలి. బంతి పూలకు శనగ పచ్చ పురుగు ఆకర్షణ చెంది పూలపై గుడ్లను పెడుతుంది. మొక్కజొన్న, పెసర, మినుము తదితర పంటలు సాగు చేసేవారు జూలై 15 లోగా విత్తుకోవడం పూర్తి చేసుకోవాలి.